నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, ఆదివారం 15 డిసెంబర్ 2024 | KHAMMAM


# 'డబుల్'కు 'మూడు' రంగులు!

- గత కేసీఆర్ హయాంలో నిర్మించిన 118 ఇళ్లు
- లబ్ధిదారులకు పంపిణీ చేసి తమ గొప్ప అంటున్న కాంగ్రెస్

భద్రాచలం, డిసెంబర్ 14 : నిరుపేదల ఇళ్ల కలను సాకారం చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రతిష్టాత్మకంగా నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఇంకొన్ని నిర్మాణాలు పూర్తయినా ఎన్నికల కోడ్ రావడంతో.. వాటిని పంపిణీ చేయలేకపోయారు. దీంతో వాటికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రంగులు మార్చి తమ గొప్పగా చెప్పుకునేందుకు తాపత్రయపడుతున్నది. భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కట్టించిన 118 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రంగులు మార్చడమే పనిగా పెట్టుకున్నది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కట్టకున్నా.. ఇది తమ ఘనతగా చెప్పుకునేందుకు శనివారం 111 ఇళ్లకు రంగులు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. బీఆర్ఎస్ పాలనలో కట్టించిన ఇళ్లను తమ ఖాతాలో వేసుకునేందుకు రంగులు వేయించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండడంతో అక్కడి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.



గత కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కాంగ్రెస్ రంగులు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య తదితరులు

# పేదలకు కొండంత అండగా కేసీఆర్

- సీఎంఆర్ఎఫ్ ద్వారా లక్షలాది మందిని ఆదుకున్న మాజీ సీఎం
- చెక్కుల పంపిణీలో బీఆర్ఎస్ నాయకులు తాతా మధు, సండ్ర

ఖమ్మం, డిసెంబర్ 14 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలకు కొండంత అండగా నిలిచారని, అనారోగ్యంతో బాధపడుతున్న లక్షలాది మంది పేదలను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తాతా మధు సిఫార్సుతో మంజూరైన 24లక్షల 16వేల 500 రూపాయల విలువైన 88 సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న నిరుపేదలకు రేవంత్ సర్కారు మొండిచేయి చూపిస్తున్నదన్నారు. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అయినప్పటికీ కేవలం రూ.60 వేలకు మించి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయడం లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5 లక్షల చెక్కును కూడా అందించామని గుర్తుచేశారు. సీఎం సహాయ నిధి చెక్కులను విధిగా అందించే ప్రయత్నం చేస్తున్న తాతా మధుకు సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నేలకొండపల్లి అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, చింతకాని అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, వాచేపల్లి లక్ష్మీరెడ్డి, భాష బోయిన వీరన్న, ముత్యాల వెంకట అప్పారావు, యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు బలుసు మురళీకృష్ణ, నాయకులు దేరంగుల బ్రహ్మం, బోడపోతుల బాబు, దొడ్డపనేని రామారావు, చామకూరి రాజు, సద్దాం షేక్, కోడిరెక్క ఉమాశంకర్, మద్దెల విజయ్, మంకెన రమేష్, అక్కినపల్లి వెంకన్న, పేరం వెంకటేశ్వర్లు, కృష్ణారావు పాల్గొన్నారు.

# అండగా ఉంటాం.. అధైర్యపడకండి

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- భాస్కర్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

రామవరం, డిసెంబర్ 14 : తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మోరె భాస్కర్ అని, అలాంటి వ్యక్తి లేకపోవడం పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శనివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 9వ వార్డులో భాస్కర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ తరపున రూ.5 లక్షల చెక్కును ఎంపీ అందజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పిల్లల విద్య, ఉపాధిలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. భాస్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ భాస్కర్ తన చిన్ననాటి మిత్రుడని, ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. దీక్షా దివస్‌ను విజయవంతం చేయడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నేతలు ఉప్పల వెంకటరమణ, అనుదీప్, తొగరు రాజశేఖర్, బండి రాజుగౌడ్, యాకయ్య, కొట్టి వెంకటేశ్వర్లు, హుస్సేన్, మంతపురి రాజుగౌడ్, ఇతర నాయకులు బాలశౌరి, ఎండీ రజాక్ పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారం అందించాలి

## డైట్ మెనూను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కొణిజర్ల, డిసెంబర్ 14 : గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతోపాటు మంచి విద్యను అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. తనికెళ్లలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను శనివారం సందర్శించిన ఆయన న్యూ కామన్ డైట్ మెనూ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారితో కాసేపు ముచ్చటించారు. విద్యార్థినులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని చేరుకునేందుకు కష్టపడి చదవాలని సూచించారు. చదువులో పోటీతత్వం పెరిగితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించే కార్యక్రమాలు, వసతి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల విద్యా ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి, వైస్ ప్రిన్సిపల్ ఎం.నవ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కే.రజిని, ఎక్స్‌బ్రాంచ్ ఇన్‌చార్జి బీ.రాజేశ్వరి, ఏవో కే.చంద్రయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : గ్రూప్-2 పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీపీఎస్సీ నిబంధనల మేరకు ఆది, సోమవారం కొత్తగూడెం పట్టణంలోని 38 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 13,465 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం అభ్యర్థులందరూ పరీక్ష సమయానికి గంటముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని పేర్కొన్నారు.

# నో టాస్క్‌ఫోర్స్

- ఖమ్మం జిల్లాలో అక్రమ మైనింగ్‌పై అటకెక్కిన 'కార్యాచరణ'
- నిద్రనటిస్తున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాల అధికారులు
- మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ, పోలీస్, పీఆర్, రవాణా శాఖలు
- జిల్లాలో యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్, గ్రానైట్ తవ్వకాలు, తోలకాలు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అక్రమార్కుల ఇసుక దందాలు

**జిల్లాలో అక్రమ మైనింగ్ అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. అందులో అత్యధిక శాతం అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతోంది. మైనింగ్‌లో అక్రమాలను అరికట్టేందుకు గత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసినప్పటికీ అది ఇప్పుడు మచ్చుకైనా కన్పించడం లేదు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్, పీఆర్, రవాణా శాఖలు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో జిల్లాలో ఇసుక, గ్రావెల్, గ్రానైట్ తవ్వకాలు, తోలకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కేవలం అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకే ఏర్పాటైన కార్యాచరణ బృందాలు ఏడాది క్రితం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అటకెక్కాయి. ఇక వాటిల్లోని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా నిద్రనటిస్తూ చేష్టలుడిగి చూస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు ఖజానాకు చేరడం లేదు. మరోవైపు సహజ వనరులు ధ్వంసమవుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా చలనం లేదు.**

**-మామిళ్లగూడెం, డిసెంబర్ 14**

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇలా..

గత కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన మైనింగ్ పాలసీలో భాగంగా జిల్లాలో అక్రమ మైనింగ్‌ను నిలువరించేందుకు నాడు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో రెవెన్యూ శాఖ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు, పోలీస్ శాఖ నుంచి టాస్క్‌ఫోర్స్ ఏసీపీ/సీఐ, రవాణా శాఖ నుంచి డీటీవో/ ఎంవీఐ, మైనింగ్ అండ్ జియాలజీ శాఖ నుంచి అసిస్టెంట్ జియాలజిస్ట్/రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటూ జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్, పోలీస్ శాఖ నుంచి ఎస్‌హెచ్‌వో, పీఆర్ నుంచి నుంచి ఎంపీడీవోలతో మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పాటు చేశారు. ఈ బృందాలు మైనింగ్ అక్రమాలపై తనిఖీలు చేసి.. వాటిని నిలువరించి కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ ఏడాది కాలంగా కార్యాచరణలోకి దిగిన పాపాన పోలేదు. చివరికి మంత్రులు కూడా సమీక్షించే పరిస్థితి లేదు.



ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి ఎదుట ఉన్న ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తున్న దృశ్యం

### అక్రమార్కులు, అధికార పార్టీ నేతల దోస్తీ..

జిల్లాలో అక్రమ మైనింగ్ చేస్తున్న కొందరు అక్రమార్కులు అధికార పార్టీ నేతల పేరుతో తమ దందాను కొనసాగిస్తున్నారు. తొలుత వీరిపై అధికార పార్టీ నేతలు కక్షసాధింపులకు దిగారు. ఆ తరువాత ఇద్దరూ ఒక్కటై అక్రమాలను చక్కబెట్టుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### డిప్యూటీ సీఎం ఇలాకాలో అనంతం..

ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో మైనింగ్ అక్రమాలు అనంతంగా బయటికొస్తున్నాయి. ఇసుక వనరులు అధికంగా ఉన్న మధిర నియోజకవర్గం నుంచే అక్రమ ఇసుక దందా మొదలైంది. గత కేసీఆర్ సర్కారులో కేవలం ప్రభుత్వ పనులు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకే అధికారులు ఇసుక కూపన్లు జారీ చేసేవాళ్లు. కేవలం వాటితోనే అధికారికంగా ఇసుక రవాణా జరిగేది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అధికారిక అనుమతులు ఏమీ లేవు. వైరా నది, ఎర్రుపాలెం కట్టలేరు, మధిర ఏరు వంటి ఇసుక వనరుల నుంచి 24 గంటలూ యథేచ్ఛగా తోలకాలు కొనసాగుతున్నాయి. ఇక పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో గ్రావెల్, గ్రానైట్ దందాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇక ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏకంగా గుట్టలే మాయమవుతున్నాయి. తక్కువ విస్తీర్ణంలో అనుమతి తీసుకొని ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి తోడు మరికొందరు అక్రమార్కులైతే పొరుగునే ఉన్న ఏపీ రాష్ట్రంలోని వత్సవాయి నుంచి మున్నేటి ఇసుక అక్రమంగా తెలంగాణలోకి తెచ్చి విక్రయిస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులనూ ఎగవేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఓ మంత్రి పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఓ అక్రమార్కుడి మూడు వాహనాలూ ఖమ్మం అర్బన్ పోలీసులకు పట్టుబడ్డాయి.




ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపి ఉంచిన ఇసుక లారీలు

### నిండుకున్న డీఎంఎఫ్‌టీ ఖజానా..

మైనింగ్ అక్రమాలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలం కావడంతో జిల్లా మినరల్ ఫండ్స్ ట్రస్ట్ ఖాతాలో నిధులు నిండుకున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఏటా సుమారు రూ.200 కోట్ల వరకు నిధులు ఉండేవి. కానీ.. ప్రస్తుత 2023-24లో డీఎంఎఫ్‌టీ ఖాతాలో రూ.13 కోట్లు మాత్రమే ఉండడం గమనార్హం. ఇక సీనరేజ్‌లోనూ కేవలం రూ.92 కోట్లే సమకూరాయి. తద్వారా డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా జిల్లాలో జరగాల్సిన అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి.

### మైనింగ్ పాలసీపై సమీక్షలూ లేవు

మైనింగ్ అక్రమాలపై జిల్లాస్థాయిలో మంత్రుల ఆధ్వర్యంలోగానీ, కలెక్టర్ ఆధ్వర్యంలోగానీ ఈ ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సమీక్ష సమావేశం జరగలేదు. అక్రమ మైనింగ్‌పై ప్రజల నుంచి అనేక ఫిర్యాదు అందుతున్నా చర్యలూ శూన్యమవుతున్నాయి. మీడియా సాధనాలు, సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున కథనాలు వెలువడుతున్నా స్పందన ఉండడం లేదు.

### దాడులు ముమ్మరం చేస్తాం..

అక్రమ మైనింగ్‌పై జిల్లావ్యాప్తంగా దాడులను ముమ్మరం చేస్తాం. అనుమతులు లేకుండా జరిపే తవ్వకాలు, తోలకాలపై తీసుకోవాల్సిన చర్యల విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. జిల్లాలో ఎక్కడ అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు సమాచారం ఉన్నా, ఫిర్యాదులు వచ్చినా వెంటనే వెళ్లి దాడులు చేస్తాం. దాంతోపాటు నిరంతరం నిఘా ఉంచుతాం.

–సాయినాథ్, ఏడీ, మైనింగ్

# ఆళ్లపల్లికి పులొచ్చింది!

- గాండ్రింపులు వినిపించాయని చెబుతున్న దొంగతోగు గ్రామస్తులు
- ఆనవాళ్లు సేకరించే పనిలో నిమగ్నమైన అటవీ శాఖ అధికారులు
- ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక



ఆళ్లపల్లి అడవుల్లో పులి అడుగు జాడలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆళ్లపల్లి, డిసెంబర్ 14 : సరిహద్దు జిల్లాలో సంచరించిన పెద్దపులి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అడుగు పెట్టినట్లు తెలుస్తున్నది. శనివారం తెల్లవారుజామున పులి గాండ్రింపులు వినిపించినట్లు ఆళ్లపల్లి మండలం దొంగతోగు గ్రామస్తులు చెబుతూ ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు గుండాల రేంజ్ పరిధిలోని దొంగతోగు అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్లు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. నిన్న, మొన్నటి వరకు ములుగు జిల్లా మంగపేట, తాడ్వాయి, కరకగూడెం అడవుల్లో సంచరించిన పులి.. అక్కడి నుంచి సరిహద్దున ఉన్న గుండాల అటవీ రేంజ్ పరిధిలోకి అడుగు పెట్టడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో దొంగతోగు, ముత్తాపురం, సజ్జలబోడు, నడిమిగూడెం గ్రామాల రైతులు శనివారం చేను, పొలం పనులకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. దొంగతోగు గ్రామానికి కిన్నెరసాని అభయారణ్యం దగ్గరగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతంలోనే పెద్దపులి సంచరిస్తున్నట్లు సమాచారం. అయితే అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దని, చేను పనులకు వెళ్లిన వారు త్వరగా ఇళ్లకు చేరుకోవాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పెద్దపులి రోజుకు 20 కిలో మీటర్ల చొప్పున ప్రయాణించే అవకాశం ఉండడంతో ఒకచోట నుంచి మరో చోటుకు చేరుతుందని, ఈ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. పోడు భూములు అడవులకు దగ్గరగా ఉండడంతో రైతులు అటువైపు వెళ్లడానికి జంకుతున్నారు. పశువులను సైతం మేతకు తీసుకెళ్లడానికి కూడా భయపడుతున్నారు. మూడేళ్ల క్రితం ఈ ప్రాంతంలో సంచరించిన పులి జంతువులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. పులి ఆనవాళ్ల కోసం గుండాల రేంజర్ నరసింహారావు, ఆళ్లపల్లి రేంజర్ కిరణ్‌కుమార్, రేగళ్ల రేంజర్ జశ్వంత్ ఆధ్వర్యంలో కిన్నెరసాని అభయరణ్యంతో పాటు చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నీటి వనరులు ఉన్నచోట అమర్చిన సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అటవీ ప్రాంతాలను ఆనుకుని నివసించే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

## ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్




మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్, డిసెంబర్ 14 : కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో డబ్బు, సమయం ఆదా అవుతాయని, త్వరితగతిన కేసులు పరిష్కారమవుతాయన్నారు. అన్న క్యాంటీన్‌ల ద్వారా కక్షిదారులకు భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు. కాగా.. జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, రోడ్డు పరిహారం కేసులను పరిష్కరించారు. అన్ని రకాల కేసులు కలిపి మొత్తం 9,759 పరిష్కారం అయ్యాయి. కార్యక్రమంలో జిల్లా జడ్జితోపాటు న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరేళ్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాలో 3,339 కేసులు పరిష్కారం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,339 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తెలిపారు. సివిల్, మోటర్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు, సైబర్ క్రైం కేసులు కలిపి మొత్తం 2,275 కేసులు పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. అలాగే ఇల్లెందులో 240, భద్రాచలంలో 532, మణుగూరు కోర్టులో 292 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంది మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు బత్తుల రామారావు, సుచరిత, సాయిశ్రీలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా జడ్జి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, ఎండీ సాధిక్‌పాషా, ప్రవీణ్‌కుమార్, దూదిపాల రవికుమార్, నల్లమల ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.